కథానిక :



ఆదిశేషయ్య తోళ్ళఫాక్టరీలో మేనేజరుగా ఉంటున్నాడు. ఆస్తిపాస్తీ చేశాడు. పెద్ద సంసారం, బాదరబందీ లేదు. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. భార్య వెంకమ్మగారు దేవాంతకురాలు. నోరెత్తిందంటే ఆవిడతో ఎవరూ చాలలేరు. చీటికీ మాటికీ నోరు చేసుకుంటూనే ఉంటుంది. కూతురు శారద ఇంటరుమీడియట్ పరీక్షకి ఆరోసారి వెళుతోంది. బోలెడంత గర్వం. నిలువెల్లా రోషం.

ఆదిశేషయ్య చెల్లెలు, నరసమ్మ, భర్త పోయిన దగ్గరనుంచి అన్నగారి ఇంట్లోనే ఉంటోంది. నరసమ్మ కొడుకు రామం స్కూల్ ఫైనలు చదువుతున్నాడు. కూతురు, పార్వతికి పద్నాలుగేళ్లు. పెద్దపిల్లయి కూర్చుంది.

నరసమ్మకుటుంబం చాలా బీదకుటుంబం. పయివాళ్ళ ఇంట్లో తిండికి చేరిందని రోజూ వెంకమ్మగారూ, శారదా, నానామాటలూ అంటుంటారు. నరసమ్మ ఆ ఇంట్లో దాసీ దానికంటే కనాకిష్టం. శారద పిల్లలని కొడుతుంది. వెంకమ్మగారు తిడుతుంది. కాని ఎవ్వరూ నోరెత్తడానికి వీలులేదు. ఈ కష్టాలకి నరసమ్మ చిక్కి శల్యమైపోయింది. బెంగపెట్టుకుని ఎప్పుడూ సరిగ్గా భోజనం చెయ్యదు; నిద్రపోదు. కొడుకు పరీక్షపేసయి ఉద్యోగం చేసుకోవాలి. కూతురికి పెళ్లి కావాలి. పాపం, కూతురికి గుండెజబ్బు. మందూ మాకూ లేదు. ఆదిశేషయ్య మందిప్పిద్దామని డాక్టర్ని పిలిస్తే వెంకమ్మ నానా తిట్లు తిట్టి మానిపించింది. నిజానికి పార్వతి ఎంతో చక్కటి పిల్ల. తెల్లగా చిక్కటి పాలలాంటి శరీరం. పెద్దకళ్లు. ఎంతో అందంగా ఉండేది. అలాంటిది. పాపం, సన్నంగా బల్లెంలా తయారయింది.

రామం స్కూలుఫైనలు పరీక్షకి రాత్రి ఒంటిగంటవరకూ చదువుతున్నాడు. వాడికి వయస్సు తక్కువైనా తమ కష్టసుఖాలు బాగా తెలిసేయి. తను వేగం ప్యాసయి ఉద్యోగం చేసుకొని, తనూ తల్లీ చెల్లెలూ, వేరే ఉండాలని కలలుకనేవాడు. పిల్లవాడి మనస్సు చెడిపోతుందని తల్లి ఈ విషయాలు వాడితో అనేదికాదు. కాని, రామానికి, చదువుకుంటున్నప్పుడూ అదే ఆలోచన. పరీక్షల్లోనైనా తనకి మనశ్శాంతి లేదు. వేరే చదువుకోడానికి గదిలేదు. పిల్లలు అల్లరి పెట్టేవారు. వెంకమ్మ కూర్లబజారుకి వెళ్లమనేది. శారద ఇంకో పని పురమాయించేది.

ఆదిశేషయ్యగారి పిల్లలు, దాసుగాడు, సత్యంకూడా తిన్నెంతో చులకన చేసేవారు. అత్తయ్య వీళ్లకి ట్యూషను చెప్పమంటుంది. వాళ్లు చెప్పినమాట వినరు సరికదా మిక్కిలి తిరగబడతారు. దాసుగాడు తన పెన్ను దాచేశాడు. సత్యం తన పుస్తకంలో బొమ్మలన్నీ చింపేశాడు. పెంకి వెధవలు. సరియైన అదుపు ఆజ్ఞలు లేక పూర్తిగా చెడిపోయారు. దాసుగాడికి ఆరో క్లాసు రెండేళ్లయి పోతోంది. ఎప్పుడూ బడికి వెళ్లడు. ఏ మామిడితోటలో కాయలు కొడుతూనో, లేకపోతే జాలారీ గుంటలతో కలసి చెరువులో చేపలు పడుతూనో, కాలక్షేపం చేస్తాడు. బీడీలకి, సినీమాలకీ, డబ్బుల్లేకపోతే కాటువేస్తాడు. ఒకసారి కోమట్లపిల్లడితో కలసి వాళ్లింట్లో ఒక బంగారపు గొలుసు కాజేసి, మిఠాయి దుకాణంవాడికి అమ్మేశాడు. కోమటాడు నాలుగు అంటించాడు. వీడిని అంతా తిడతారు, తంతారు. తనుమాత్రం, ఏమీ అనకూడదు.

"పెన్ను ఏదిరా, ఏం చేశావు?" అన్నాడు రామం.

"ఏమో ఎవరికి తెలుసు?" అంటూ నవ్వేడు దాసుగాడు.

"నువ్వు తాకేం! చెప్పకపోతే తంతాను".

ఎంత అడిగినా చెప్పలేదు. కాని సత్యాన్ని భయపెడితే చెప్పేశాడు—అర్ధరూపాయి కమ్మేశాడని. సత్యం చిన్నవాడు. దాసుగాడి దగ్గర ఇంకా ట్రయినింగు అవుతున్నాడు. రామానికి పట్టరాని కోపం వచ్చింది. ఫెడీమని ఒక లెంపకాయ కొట్టేడు.

ఇంకేముంది రాద్ధాంత సిద్ధాంతమయింది. అత్తయ్య తోకతొక్కిన పాములా ఛర్రున లేచింది. తన కొడుకుల్ని కొట్టేస్తున్నాడని నానా మాటలూ అడింది. మామయ్య, శారదా అంతా చేరేరు. ఎవరి నోటి కొచ్చినట్లు వాళ్లన్నారు.

"కుర్రనాగమ్మ పరదాకి పెన్ను తీస్తే కొట్టేసి చంపేశాడు. నిష్కారణంగా చచ్చిపోను పిల్లడు" అని ముక్కుమీద వేలేసుకుంది అత్తయ్య.

"పరదాకి తియ్యలేదం కాదు. కాటువేసి, పదిరూపాయల పెన్ను, అర్ధరూపాయికి కమ్మేశాడు"

పదిరోజుల్లో పరీక్షలున్నాయి. రామానికి కళ్లంట నీళ్లు తిరిగాయి.

"పోనీ వెధవ పెన్ను." అన్నాడు మామయ్య

"పెన్నుగురించి కాదు. పిల్లవాడు పూర్తిగా చెడిపోతున్నాడు" అన్నాది అమ్మ.

"ఓస్, ఏంబుద్ధి—ఆమాత్రం మాకు తెలీదు కాబోలు." అంటూ ఎత్తిపొడిచింది శారద.

"ఏదో ఇంత తిని ఇంట్లో పడిఉండడం మానేసి, ఎందుకా వెధవల్లరి." అత్తయ్య నోరు మంచిది కాదు.

"చచ్చినట్లూ పడిఉండక ఏ చేస్తున్నామమ్మా," అన్నది నరసమ్మ.

"పడిఉండకపోతే వెళ్లవమ్మా. నిన్నెవ్వరూ ఇక్కడ పట్టుకుని కూర్చోలేదు."

"ఊరుకో అమ్మా దానితో ఎందుకా గొడవ—" అన్నది పార్వతి. చెల్లికూడా జ్ఞానమొచ్చిన పిల్లాయెను.

"అవునే, ఇంట్లో మెక్కుతూ కూర్చుంటే అంతా గొడవగానే ఉంటుంది. సంసారం చేసే వాళ్లకి తెలుస్తాయి ఆ కష్టసుఖాలు." అంటూ లేచింది అత్తయ్య.

"అవునత్తా. తిండికి లేక మీ ఇంట్లో చేరాక మీ రేమన్నా చెల్లుతుంది."

"ఓహో, ఈ గుంటముండకూడా మాటలు నేర్చింది. పిట్ట కొంచెం కూత ఘనమూను—" అన్నాది శారద.

"పెళ్లికావలసిన పిల్ల. దాన్నలా తిట్టకే" అన్నాది నరసమ్మ.

"ఊరుకో అమ్మా; అది ముద్దులగుమ్మ—దాన్నేమైనా అంటే అమ్మగారికి కోపమొస్తుంది" అత్తయ్య చేతిలో చీపురు వాకిట్లోకి విసిరేసింది.

రామానికి, పట్టరాని కోపం, దుఃఖం, పౌరుషమూ వచ్చాయి.

"అవునత్తయ్యా, అది అన్నదాంట్లో తప్పేముంది. తిండికిలేక మీ ఇంట్లో చేరేమంది. అంతేనా—పరీక్ష లయిపోతే వేరే పోతాంలే—కూలో నాలో చేసుకుని బతగ్గలం."

"వెళ్లరా. ఎవర్ని జడిపిస్తావు—వెధవ వేషం".

"ఊరుకో నాయనా. ఎందుకనవసరంగా తిట్లు తినడం—"

రాత్రయిపోయింది. ఎవరిమానాన్ని వారు భోంచేసి పడుకున్నారు. వంటింట్లో దీపం పెట్టుకుని, రామం, దీక్షగా చదువుతున్నాడు. కాని, పాపం, మనస్సు చెదిరిపోయింది. బెంగతో తల్లి కుష్కించిపోయింది. తమ ఇద్దరికోసం బతికిఉండి ఇన్ని కష్టాలు పడుతోంది. చెల్లిమాత్రం—వయస్సులో ఉండే పిల్ల ఎలా ఉండవలసింది! నీరసించిపోయింది. కళ్లు లోతుకు పోయాయి. సంతోషం లేదు. సమంగా తిండిలేదు. విశ్రాంతి లేదు. ఇంట్లో సర్వ చాకిరీ వీళ్లిద్దరే చేస్తారు. రాత్రి పన్నెండయింది. గోడకి జారబడి కళ్లల్లోంచి జారిన నీళ్లు తుడుచుకున్నాడు. నరసమ్మ వంటింట్లోకి వచ్చి చూసింది. "చాలా రాత్రయింది. నాయనా, వెళ్లి పడుకోరాదూ. ఇంకా మేలుకుంటే జబ్బు చేస్తుంది." అని చెయ్యి పట్టి లేవదీసింది. చెయ్యి వేడిగా ఉందేంరా? జ్వరంగాని రాలేదుకదా!" ఒంటిమీద చెయ్యివేసి చూసింది. చిన్న జ్వరం తగిలింది. రామాన్ని మంచంమీద పడుకోబెట్టి, ప్రక్కని కూర్చుని విసనకర్రతో విసురుతోంది నరసమ్మ.

"నువ్వెళ్లి పడుకో అమ్మా—విసరక్కర్లేదు."

"అలాగే, నువ్వు నిద్దరపో—" అంటూ రామం క్రాఫింగు నుదురుమీద పడుతోంటే చేత్తోటి వెనక్కి తీసింది నరసమ్మ. వీడొక్కడి ఆశమీద తను బతుకుతోంది. వీడు పెద్దవాడై బతికి బాగుంటే అంతే చాలు. తన కాళ్లమీద తను నిలబడగలిగితే, చెల్లెలికి పెళ్లిచేస్తాడు. తరువాత వీడికి పెళ్లిచేసి, కోడల్ని తన ఇంటికి తెచ్చుకుంటుంది. తన కొడుకూ, కోడలూ నట్టింట్లో తిరిగితే తన కళ్లార చూడగలదు. ఆ ఆశమీదే తను బతుకుతోంది.

'తండ్రీ, నాకొడుకు బతికి బాగుంటే అంతేచాలు—"అని మనసులో భగవంతుడిని ప్రార్థించుకుంది. ఆమె కళ్లంట జలజల నీళ్లు రాలేయి. చీరకొంగుతో వొత్తుకుని ముక్కు తుడుచుకుంది.

"అమ్మా, ఏమిటది?"

"ఏమీ లేదు, ఇంకా నిద్దర పట్టలేదురా—వాకేం దారిరా—జబ్బు చేస్తుంది—" అన్నాది నరసమ్మ.

"నిద్ర పట్టకపోతే నన్నేం చెయ్యమన్నావు".

"బెంగ పెట్టుకుంటున్నావేమిట్రా—బెంగెందుకు. ఎలాగయేది అలా అవుతుంది."

"బెంగలేదుకాని—చదువు తిన్నగా సాగకుండా ఉంది. పరీక్ష ఏమవుతుందో అని బెంగగా ఉంది."

"ఏదో కానీ—ఏం చేస్తాం—అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడు." రామం కళ్లు అలసి, నిద్రపోయాడు. కాని తెల్లవార్లూ నరసమ్మకి నిద్రే లేదు.

* * * *

రామానికి పరీక్ష లయిపోయి రెండునెల లయిపోయింది ఒకరోజు సాయంత్రం, వాకిట్లో ఆదిశేషయ్యగారు, ఈజీచైరుమీద కూర్చుని పేపరు చూస్తున్నారు. నరసమ్మ వీధిలోంచి తొందరగా వచ్చి "అన్నయ్యా, పరీక్షలగురించి పేపర్లో వచ్చిందట—పేసయాడేమో చూడ్డా"—అన్నాది.

"వాడి నెంబరు నాకు తెలీదు—ఏమో, పోయే ఉంటుంది. వెధవ—ఎప్పుడేనా చదివితేనా? వాడొచ్చేక కనుక్కోవచ్చులే. తొందరేమిటి?" అని చిరాకుగా—కాలుస్తున్న పైపులోంచి పొగ మేఘంలా వదిలాడు—ఈ రోజు ఆయన మనస్సేం బాగులేదు. మార్కెట్టులో తోళ్లఖరీదులు గద్దల్లా ఆకాశానికి ఎగిరాయి. సమయానికి, తోళ్లు సప్లయి చెయ్యలేకపోయింది వాళ్ల కంపెనీ—అదీ సొద.

నరసమ్మ మనసుండబట్టక వీధిలోకి వెళ్లి దారినిపోయే కుర్రవాళ్ల నడిగింది:

"నాయనా, పరీక్షలగురించి పేపర్లో వచ్చిందట, మా రామం పేసయాడా—" అనిఅడిగింది.

వాళ్లు నవ్వుకున్నారు—అందులో ఒకడు మీవాడి పరీక్ష పోయింది. ఇంటికొస్తే, ఇంట్లో వాళ్లు తిడతారని ఎక్కడికో వెళ్లిపోయాడు." అని చెప్పి వెళ్లిపోయారు. నరసమ్మ నిలువునా కూలిపోయింది. ఏడిచింది.

"తెగించి, వాడేదేనా సాహసం చెయ్యలేదుకదా!" అని నెత్తీ నోరూ కొట్టుకుంది. పార్వతి తల్లి నోదార్చింది. "వాడెప్పుడూ, అలాంటి పనిచెయ్యడమ్మా. మనగురించేనా వాడు ఆ లాంటి పని చెయ్యడు—" అని, పార్వతి కళ్ళు తుడుచుకుంది.

ఆదిశేషయ్య కబుర్లుపెట్టించి కనుక్కుంటే ఇద్దరు స్టూడెంట్లు వచ్చి చెప్పేరు. రామం పరీక్షపోయిన తరువాత చెరువులో పడబోతే స్నేహితులు కనిపెట్టి "నీతల్లినీ, చెల్లెల్నీ గంగలో దింపి, పోతావా!" అని చీవాట్లు వేశారట. అప్పుడు తను ఏదో బతుకుతెరువు చూసుకున్నవరకూ ఈ ఇంటిగుమ్మం తొక్కనని, రైలెక్కి, ఎంత చెప్పినా వినకుండా వెళ్ళిపోయాడని" చెప్పేరు.

"నీ చెప్పలేదమ్మా, నువ్వు బెంగపెట్టకోకు—అన్నయ్య తప్పక ఉద్యోగం సంపాదించుకుని వస్తాడు—" అన్నాది పార్వతి.

"కంటికి కనబడకుండా దూరమయేడు. ఎటు వెళ్లేడో—వాడి తిండితిప్పలు ఎలాగ; —చిన్నవాడు—వాడికెవరు దిక్కు—" అని తల్లి కుమిలి కుమిలి ఏడిచింది.

"ఏమీ భయం లేదమ్మా—అన్నయ్య చాలా ధైర్యవంతుడు" అని తల్లిని ఓదారుద్దామని ప్రయత్నించింది—పార్వతి.

"వాడిని రక్షించి, కాపాడు తండ్రీ" అని భగవంతుడికి మనసులో నమస్కరించింది నరసమ్మ.

కేసరికుటీరం లిమిటెడ్, మద్రాస్

ఒరిస్సా, నైజామ్ డొమినియన్సు, ఆంధ్రజిల్లాలు. తమిళనాడులకు ఏజెంట్లు:

సీతారామ జనరల్ స్టోర్సు,

బరంపురం, సికింద్రాబాదు, బెజవాడ, మధుర.

(Jai Hind Publicities)